జమీందారు

అక్కడతగాడు కూర్చొని యున్నాడని ఎవ్వరికీ తెలియదు. సామానంతా పట్నం చేర్చవలసినదిగా తాఖీదిచ్చి, గుమాస్తాలకు వొప్పజెప్పి తానొక సర్వసామాన్యజనుడిలా, ప్రచ్ఛన్నంగా కాలువ ఆవలి గట్టుకు బల్లకట్టుమీద దాటి, ఒంటిగా ఎండవేళ ఆవలిగట్టున చెట్టునీడను వేరుమీద వీపుజేరమోసేలా విశ్రమించి యున్నాడు. చెట్టు ఎన్నో గాలివానల కుర్రూతలూగి, చెక్కుచెదరని ఎదుగుతో ముదిమితో పేరెన్నికగన్న చింతచెట్టు. ఒకవంక ఏఏటా అది, చిగురునుండి గింజదాకా కన్నెపిల్లల కింపు గొల్పుతూ నవనవోన్మేషంగా వున్నా, వృద్ధులసంస్మృతి కతీతమై, గట్టు కూడా దాన్నిబట్టే పోశారా అన్నంత ఆనవాలురూపం కలిగి వుంది. చెంతనే గోదావరినదిపాయనుండి విడివడే కాలువ. కాలువయొడ్డు, కాలం వానాకాలం కావడంచేత, గడ్డి పట్టి ఆకు పచ్చగా వున్నాయి. కాని ఒక గట్టుమీద ఎర్రని కంకరరోడ్డు వేయబడి రాదారీ కనబడుతూ, బళ్ళూ ప్రజలూ ఏ వేళా సందడిగా వెడుతూవున్నజాడ కనిపిస్తుంది. ఊరు కూడా దానికి చేరి అదిగో అన్నట్టగపిస్తుంది. రెండవ గట్టెక్కితే అన్నీ ఊడ్చిన పొలాలూ, పొలాలమధ్య గున్నమామిడిచెట్లు చెన్నంగి కొబ్బరిచెట్లు, కూరపాదులు, కొంగలు, కలుపుతీత స్త్రీల కోకల రంగులు ఎన్నెన్నో కానవచ్చి ఆ గట్టుకూ ఈ గట్టుకూ ఎంత మాత్రం పోలికే లేదన్నట్టుంటుంది.

పారకు లప్పుడే, బల్లకట్టవసరం లేకుండా, నా మాటల వెంబడినే కాలువ దాటి చింతచెట్టున్న గట్టుకు వచ్చినట్టున్నారు. కాని అట కూరుచున్నాతని దృష్టి రాజమార్గముమీదనే వున్నది.

మోటబళ్ళమీద మొరకుమనుష్యుల మూపులమీద నాడా రోడ్డమ్మట అతగాని సామానెంత తరలింపబడింది చెప్పశక్యం కాదు. అతడు నిన్నటివరకు ఆ కొంంద్రకధిపతి. వేలకొద్ది ఎకరాలకు జమీందారు. అతనెంత చెబితే అంత, నిన్నటివరకూ ఆ చుట్టుపట్టంతకూ, నేడొక్క శాసనంతో అతని జమీ లాగివేయబడి అతని కిరవై లక్షల రూపాయలు నష్టపరిహారంక్రింద యీయబడి 'నీ యిష్టమువచ్చిన చోటికి నీ చరాస్తితో వెళ్ళిపోవచ్చు. మరి ఇందుగల సెంటు భూమి నీదికాదు. ఇక్కడుండ డానికి నీకు ఇల్లు లేదు. వల్లకాదు.' అని సర్కారువారు ముదలయిడి సాగనంపేరు.

జమీందారుడు ముప్పైయేండ్ల వయస్సువాడు. వయస్సునకు తగిన అనుభవము గలవాడు. ఊహాప్రపంచములో మునిగితేల్తూ అనుకొనువాడు. 'ఇన్నాళ్ళూ ఆవలిగట్టున నివసించి భోగించినదానికీ ఈ నా డొక్క ముహూర్త మీవలిగట్టున విశ్రమించుదానికీ ఎంత తేడా కనిపిస్తూవుంది!' అని విస్తుపో సాగాడు. తానెక్కడ కూరుచున్నది మరచిపోయాడు. అతని నెత్తిమీద నొక్కొక్కప్పుడు నల్లని నీటిమబ్బు, ఒక్కొక్కప్పుడు నిశితమైన వేడియెండ విచ్చలవిడి మారిపోతూవున్నాయి. కనుచూపుమేరలో, చిన్న చిన్న గడ్డిపూలు వికసిస్తూ కొన్ని, ముకుళింపుగంటూ కొన్ని కానవచ్చాయి. ఏదో పక్షికూత దూరం నుంచి ఆకాశమార్గాన తన్ను పలుకరించేది. ఊడ్చినచేలు దుబ్బ

కట్టి ఎత్తు ఎదిగి, తమ మీదుగా చల్లనిగాలి నడిచి పోయేలా, వొదుగు నొయ్యారం గల వయ్యాయి. అన్నింటికన్న తాను కూరుచున్న చింతచెట్టు నీడ రెట్టింతలు చల్లగా, ముమ్మరంగా, శాంతిప్రదంగా, తోచి, క్రమక్రమంగా నీటిమీద పడి వ్యాప్త మౌతూ వుంది. ఆ నీడ అలా పెచ్చుపెరిగి, ఆవలిగట్టు నెండలో చేరుకుంటుందా అనేదే అతగాని ఆలోచన ఆఘడియప్పుడు! చెట్టునీడ నీటిమీద పొడుగు కావడమే కంటూన్నాడు గాని సూర్యుడు పడమటకు వాలి క్రమక్రమంగా దిగిపోతున్న దృష్టి అతనికి సుతరాం లేదు. నీడలాగునే ప్రాణం, ప్రతిష్ట, చైతన్యం, చేష్ట గమనిస్తూ వున్నాడు.' 'నీడ దేనివల్ల ఏర్పడుతూ వున్నది?' అనే అంశంమీద అతనికి ధ్యానమే లేదు.

అయితే ఒకటి వుంది. అలా నీళ్ళమీద నీడనే ఎదర యొడ్డుకంటా చూపుసారించి దృష్టి కేంద్రీకరించడంలో, రాదారీని తరలింపుగనే అతని చరాస్తియొక్క అసంఖ్యాకరూపాల నీటి నీడలు నిలుకడ లేకుండా, ఒకే దిక్కుకు తల్లక్రిందులుగా సాగి పోతూన్నట్టు అతడు కనగలిగాడు. మోటుబళ్ళ చక్రాల తిరు గుళ్ళయొక్క కంకర యొరపిడి చప్పుళ్లు, గుర్రాల సకిలింపులు, ఏనుగుల గంటలు ఎన్నెన్నో అతని వీనులకు సోకి వింతగొలుప జొచ్చాయి. వింతలో అదోవిధమైన విచారమున్ను కలుగచేశాయి. కాని ఒక్క ధ్వనీ అక్కడాగింది లేదు. ఒక్కరూపమూ తన కెదురు తిరిగి ప్రశ్నించింది కాదు. క్రమక్రమంగా అతని బుద్ధి కుశాగ్రమైనకొద్దీ, అంతరంగికాలోచన కొక క్రొత్తకోణం ఏర్ప డింది. చెవులకో నూతనస్వరం వినబడసాగింది. అది ఆతనికి అపూర్వమైనదిగా తట్టింది.

ఒక మేనా సవారీ మోసే బోయీల మ్రోత అది ! అంత రాళమంతా ఆవరిస్తూ, దిశాంతమందు అంతరించి పోయి నట్టొక్కొక్కప్పుడు, మన చెవులనే తాకి గూబల్లో నిలబడి మారుమ్రోగుతూ న్నట్టొక్కొక్కప్పుడు ఆ ధ్వని ఆ ప్రాంత మందు అతిస్వేచ్ఛగా అనుతూ వచ్చింది.

ముందుకొమ్ము ముగ్గురు బోయీలు, వెనుకకొమ్ము ముగ్గురు బోయీలు మోస్తూవున్నారు. వెనకా లొకడు పరుగిడుతూ వున్నాడు.—' అఁఓ—ఓ—అఁ—అఅఏ—ఏఏఅ—' అని ఇలా ఆ ధ్వని హెచ్చుగా తగ్గు స్థాయిలాగా వినవస్తూ ఊరి నుండి చుట్టుదారిని రోడ్డుమీద కెక్కి జమీందారు కూర్చునివున్న చోటికి సరాసరి ఎదరున్న రేవు గమ్యస్థానంగా చేరుకుంటూ వున్నట్లైంది. పురుషుని హృదయం క్రొంగ్రొత్త స్పందనం గాజొచ్చింది.

ఈ రోజున కూడా ఆమె ఈ రేవులో స్నానంచేసి పూజా ద్రవ్యాలతో తరలివెళ్ళి దేవతాదర్శనం దేవాలయములో గావిం చడమేనా ?—' వద్దు !—నీవు తిన్నగా సామానువెనకాలే వెళ్లిపోవలసినది. వద్దు ! మనకు ! మరిదేవుడులేడు ! దేవాలయ ములో లేదు ! ' అని ఆజ్ఞాపించానే ! నా ఆజ్ఞను ఆమె ఉల్లం ఘిస్తూ ఇటు వస్తూవుందా ? ఇక్కడ స్నానముచేస్తూ వుందా ? లేక తిన్నగా వెళ్ళిపోతూవుందా ? ' అని అధికార కోపోద్రిక్త నయ నాల్తో ఆ వినవచ్చు మేనామ్రోతదెసకు తన చెవు లొక్కొక్క ప్పుడు పనిచి తన మెడ నొక్కొక్కప్పుడు త్రిప్పి, తనశ్రద్ధ నంతను, మేనాలోనుండక తప్పదని యనుకొని తాను తలంచు కొను చిన్న అంగనయొక్క రూపురేఖలయందు, లీనమొనరించు

కొనుచు 'ఆమె మరి జమీందారిణి కాదు. సామాన్య స్త్రీ' అని తుదకేదో విధమైన కనికర మామెయెడ వహించినవాడై ఆ జమీందారుడు తిరుగ కాలువ నీటివైపు, దాని పారుదలవైపు, గనుగొనువాడు. కాలువ ఎప్పటిచొప్పునే అందగించుచు ప్రవహించుచుండెను.

ఆ మేనాలో వచ్చుచున్న దాన, సాక్షాత్తు, అతగాని సహచారిణియే ! ఆ క్రితం రోజువరకును జమీందారిణి. జమీందారిణీ హోదాలో నున్నప్పుడు ఆమె నిరంతరం సాయం సంధ్యారాగ సమయమునకు సవారీపై ఆ రేవునకు వచ్చి, ఎవ్వరు లేకుండ చేసి, తాను స్నానమాచరించి, మడుగువలువ ధరించి, పూల సజ్జతో దేవాలయమున కరిగి దేవుని సందర్శించి ఇంటికి మరలి, చనుట పరిపాటి.

దేవాలయము ఆమె భర్తయొక్క పూర్వికులు కట్టించి, ధ్వజస్తంభమెత్తించిన ఏనాటి దేవాలయమైనను, ఈ పుణ్య దంపతుల యొక్క భక్తి తాత్పర్యముల మూలమునదై నందినం నూతనంగా శోభిల్లుచు ఊరికి నిండై కనుబండువై విరాజిల్లునది.

"అయితే జమీందారుడు, అతని జమీ సర్కారువారు తీసికొన్నారు గదా, దేవాలయము కూడా విడిచిపెట్టుతాడా ? నాటి నుండి దేవాలయము గతి యేమగును ?"—అనునది రావిచెట్టు క్రింది ప్రజలమధ్య సమస్యగ ఆ నిమిష మప్పు డుండెను. 'సాయంకాల మెప్పటివలె జమీందారిణి ఆమెయొక్క యెప్పటి హోదాతో దేవాలయమునకు రాగలదా ? రాలేదా ? ఆమె మేనా నెవ్వ రాటంకపరుపగలరు ?' అని నాటి ప్రజ పెద్దకోలాహముగ, కోలాహలమునందే రహస్యముగా, యోజింపదొడంగెను.

ఊరి వారెల్లరు సంధ్యా సమయమునకు దేవాలయమును చుట్టి యుండిరి. కాని ఆ మూకబుద్ధికి, జమీందారు జమీందారిణి ఏమి చేయదలచినది, ఎటుచన్నది, ఎవరేమగునది, అంకలేదు.

ఇక్కడ జమీందారుడు, తన్ను బోయీలమ్రోత నలు దెసలనుండి ఆవరించిన ట్టావరించిన కొలందిని, చిత్తభ్రాంతిని మునుగజొచ్చెను. అత నెప్పుడూ ఆవరకు తన ప్రేయసి ఆ రేవులో స్నానము చేయుటగాని, మడిచీర ధరించి దేవాలయ మునకు జనుట గాని ప్రత్యక్షముగ జూచినదిలేదు. అందరూ విన్నట్టుగానే, తానూ వినుచు, మత విషయమున ఆమెత్రోవ నామెను పోనిచ్చుటే తదజ్ఞతకు కారణము. తాను సంఘ సంస్కారి; మత సంస్కారి. అయితే ప్రజలకొరకు, భార్య కొరకు, హిందూ మతమును చెండనాడక, దేవాలయమును సాంప్రదాయానుసారంగా నడవ నిచ్చుచు, రథోత్సవాది మహా పర్వ సమయములందు తానుగూడ పాల్గొనుచు, వచ్చువాడు. నాడే ఆతని జీవితమునందు ప్రారంభము, ఆ జన పథ ప్రాంత మందు, ఊరు దాటి, బల్లకట్టుమీద రేవు దాటి రెండవ యొడ్డు సేరి, అందుగల చెట్టువేరు నాని కూరుచుండుట.

అతడు అంతరాళమందు బోయీల మ్రోత మారు మ్రోసిన కొద్దీ, తనకు చేరికగుకొద్దీ, తన్ను దా మరచిపోయి నట్టయి, రేవు దాటించు బల్లకట్టువానిని గాని, బల్లకట్టుమీద ఇటు నటు దాటుచున్నట్టి కూలియాంధ్రను గాని కనిపెట్టలేదు. వారు మాత్ర మేదో వింతగా ఆ ప్రవాహతత్పరు నుండుండి చూచుచు, ఆ వచ్చు మేనాను తమ సొంతమైనట్లు కనుగొనుచు రిచ్చపో దొడంగిరి. కాని ఎంతకూ అది ఆగు తెన్నుగాని, తీరుగాని,

ఎవ్వరికీ తోపలేదు. ఎవరంతట వా రా చూపరులు బల్లకట్టు దిగి వారి వారి యిళ్ళకు జనిరి.

సాయం సంధ్యారాగము, నటరాజు ప్రళయతాండవమున రేగు ధూళిగా, పైకి పడమటిదెస లేచినదై, వింతగా విరివిగా, అరసింది తడవుగా, ఎర్రని తేజస్సును దిఙ్మండలమునుండి నలు దెసలా తేజరిల్లజేయుచు ఆ జమీందారునియొక్కయు, ఆమేనాలో కూరుచున్న నారీమణియొక్కయు ఏక చేలాంచలమా అన్న ట్లొప్పారెను.

రాదారీ బాటగల గట్టుమీద, బల్లకట్టురేవు వంపునే, సవారీ నిలుపుచేయబడి, అందునుండి గేస్తురాలీవలకు మేలి ముసుగుతో వచ్చుచు కనురెప్ప లెత్తకే నీటివంక చూచి, ఆవలి గట్టు దృష్టి సారించి, చెట్టునీడ నీళ్లల్లోపడ్డ జాడనే తన ప్రియుని నీడకూడ ఏకమగుచు కానవచ్చుట ఆనవాలు గొని, 'బల్లకట్టన్నా ! ఆ తట్టెప్పుడూ ఈ వేళకు మగవారున్న జాడలేదు. ఎవరా కూర్చున్నది ?' అని అడిగెను. బల్లకట్టన్న 'వారే ! జమీం దారుగారే ! లేచి వెళ్లమని చెప్పనా ? తల్లీ !' అని వేచి యుండెను. జమీందారుడు తన మోము పైకెత్తక, రెప్ప లర వాల్చి, నీటివంకకే చూచుచు, ప్రేయసి యెట్లు నీటిలో దిగి నీటాట జెలంగునది, వీక్షింప వాంఛించెను.

ముగుద కొంచె మాలోచించి, బల్లకట్టాతనితో 'వద్దులే ! కూర్చోనియి ! అక్కణ్ణే కూర్చోనియి !' అని అంతఃపురపు తీవిని, ఘోషాను పోషిస్తూ, స్నానమునకై యొక్క మునుక తన నీటినీడనే తాను వేసినదాయెను. బల్లకట్టాతడు, ఆమె తిరుగ నీటినుండి లేచులోపల, బల్లకట్టు నొకవైపుగా గట్టుకుచేర్చి,

తా నొక చెట్టుచాటు కొదిగి దాగెను. బోయీలున్ను తమతు దాము రహదారీనివున్న చెట్లవరున వెనుక నొక్కొక్క చెట్టు వెనుక కొక్కొక్కనిగ చేరుకొని మరుగుపడి యుండిరి. ఇది నిత్యమూ వారు ప్రతిరోజూ చేయుచున్న పనే. కారణం, జమీం దారిణి స్నానమాచరించి తిరుగ గట్టెక్కి, పైకిచని, పొడిబట్టలు కట్టుకొని సవారీలో కూర్చుండి తలుపులు వేసేసుకొనువరకు. ఎవ్వరును చూడరాదు. వారు సవారీ మోయు బోయీలే కానిండు. రేవుదాటించు బల్లకట్టాతడే కానిండు ! మరిన్నీ రాదారీని ఆ నిమేషమప్పుడు నడుచు జనముకూడా అటో అరమైలు ఇటో అరమైలు పొడవునా నడువకుండుట నియామకము. కావున సమస్తము నిర్జనంగాను, నిశ్శబ్దవంతంగానూ, ఆ దంపతుల కిరువురకు దోచి యొకరినీటి నీడల నొకరొకరు పెట్టుకొని యున్నట్టుండి పోయిరి ; కొంత తడవు చెరొక గట్టునా ఎదు రెదురుగా : ఇతరము ఎరుగకుండిరి.

ఈ యేమరుపాటు సమయమప్పు డా రాదారీనే ఏ నియా మకమూ నేరని ఒకానొక నిర్భాగ్యురాలు, యువతి, ఆ యసుర సంధ్యనే, ఇల్లులేక, వాకిలిలేక, ఏకడనూ రక్షలేక, భిక్షలేక ఏగుచు, ఊరకే ఉత్తదిగానున్న అ సవారీని చూచినదై, అందు లోనికి దూరి, ఇటూ అటూ తలుపులు లాగికొనుచు గాజుల చప్పుడు చేసెను.

అప్పటికి జమీందారిణి రెండవమారు తన స్నానమున గ్రుంకుకొనుచు నీటననగి యుండెను. జమీందారుని ధ్యాన మంతయు జమీందారిణి నీటనుండి నిలువునా లేచు సొబగు లింకను గాంచుటయందే పంచియుంచెను. ఆ కారణముగా మరొక

స్త్రీ వ్యక్తి సవారీలో ఆసీనయై సవారీ తలుపులిటూ అటూ లాగి కొని మూసివేసికొనుట ఎవ్వరును గాంచలేదు. కాని ఎప్పుడైతే సవారీతలుపులు మూసికొన్న ధ్వని అయినదో, రివాజు చొప్పున బోయీలు తమతమ దాగిన చెట్లచాటునుండి యివతలకు వచ్చిన వారై, సవారీని బుజములనెత్తుకొని, ఎత్తుకొనుచునే—' ఆఁ ఓఁ ఏఁ—' మొదలగు ఊతధ్వనులను వినిపించుచు వెడలి పోయిరి. 'ఏమా!' అని జమీందారిణి నీటినుండి పైకి తలెత్తి చూచుటలో ఆమె వెనుతట్టు శూన్యపథము తప్ప మరొండు లేకపోయే.

ఎదరతట్టు భర్త ఆవలిగట్టునుండి ఆమె దృక్కులలోని నెమకులాటను గుర్తించుచు ఆందోళనాతత్పరుడై, బల్లకట్టన్నను పిలిచి తన్ను కూడా తన చెలియున్న రాదారీవైపునకు జేర్చు మని కోరెను. రేవు దాటించు నాతడును, తాను దాగివున్న చెట్టు చాటునుండి ఈవలకు వచ్చి జమీందారుని జమీందారిణి యున్న యెడకు జేర్చి వా రిరువుర నొకచో కూర్చెను.

జమీందారిణి గట్టెక్కి, పొడిచీర దాల్చినదై, ' ఈమోస మెట్లు జరిగినది ? ' అని కళ్ల నీళ్ల బెట్టుకొన జొచ్చెను.

" ఏ మోసము ? " అని భర్త అడిగెను.

" ఈ నా సవారీ మాయమగుట ! " అని జమీందారిణి బదులాడెను.

" అన్నియూ మాయమైనట్లే అదియునూ మాయ మయ్యెను. నీ వింకను సవారీమీద పోయి దేవుని దర్శింప నెంచితివా అది పిచ్చి యూహ. నేను, చూడు, ఎట్లునడచివచ్చి కాలువ గట్టున కూర్చున్నానో ? " అనెను.

"మగవాండ్రే పని పడితే ఆ పనే చేయగలరు. సమస్తము విడువగలరు; నడువగలరు. ఆడువారమగు, మాకు దేవుడు, జీవుడు, సిరి, ఇన్ని కావలయును. నేడు మరి దేవుని సందర్శనమే లేదు కాబోలు నా బ్రతుకునకు" అని భార్య నుడివెను.

"ఎందుకుండదు?" అని భర్త అడిగెను.

"దేవుని సందర్శనమే నాకుండియున్న సవారీ యింత వింతగా మాయముగానేరదు" అని భార్య నిరాశ వెలిబుచ్చెను.

"ఇంకా మేనాలమీద మేలిమి మీద నీకు రోకు కలదన్న నాకు వింతగా నున్నది. దేవునిదర్శనము కాలిబాటనే మరి నీవు గావించుట ముఖ్యమని తలపోసి, యీ అనుభవము నీ జీవితమందు తద్యఃకల్పితమైంది. రా! నాతోకూడా రా! ఆ సవారీకంటె ముందుగా నొక అడ్డదారిని మనము దేవాలయము చేరగలము." అని జమీందారుడు ముందడుగు వేసెను.

"ఈ నా తెరలోని వేషముతోనేనా?" అని భార్య ప్రశ్నించెను.

"ఆ వేషము నీ వుంచుకొన్నకంటె, తీసివేయుటలోనే నే దందముంది. సామాన్యవేషములో నిన్నెవ్వరును పోల్చలేరు."

అని ధైర్యము చెప్పి ఆమె ముంగురులతో దోబూచులాడునట్టి జరీబట్టల మేలిముసుగు తొలగించెను. తొలగించులో ఆ యబలరూపము అపురూప సౌందర్యముతో విరాజిల్లినదాయెను. ఆమె కళ్ళల్లో, దేవుడు, జీవుడు, సిరి, అన్నీ ఒక్కమారు ఆతనికి మెరపు మెరసినట్టు కనబడెను.

సవారీలో తిరుగ నాడు కూర్చున్న మనిషి జమీందారిణే యనుకొని బోయీలు చుట్టుదారిని దేవాలయము కడకుతీసుకొని వచ్చునంతలో అడ్డుదారిని జమీందారిణియు, జమీందారుడు దేవాలయద్వారమును జేరుకొనిరి.

అక్కడ గుమిగూడి చోద్యముగ జూచు ప్రజమధ్యనుండి కొందరు ఆకతాయిలు, కఱ్ఱలు, గొడ్డళ్లు పుచ్చుకొని 'ఈమె యింకను దేవుని జూచుటకు సవారిమీదనే వచ్చినదే!' అని సవారీ తలుపులు తెరచుకొనులో సవారీపై నొక దెబ్బమొత్తి, పైకెత్తి కీడుకంట గీటిరి. కాని, అది సాగకుండ అప్పటికి సరిగా కాలినడకను అందుకొని, దేవళద్వారముముందు మెట్లపై భార్యా సమేతుడై నిలుచుండి, జమీందారుడు పెద్దయెలుంగున 'జమీం దారిణి కాలినడకనే నాతో నేడు నడచివచ్చి యిచ్చటనే యున్నది. ఆమె సవారీలో లేదు' అని వారికి నచ్చజెప్పి, భయానక కృత్యమేమీ జరుగకుండచేయుచు, వారితోపాటు తానును, తన ధర్మపత్నియు ఆ సవారీలోనుండి ఎవరు దిగుతారో అని పరికింపజొచ్చిరి.

ప్రజలలో ఆ వరకును జెలరేగిన కోలాహలముగాని, జమీందారీ దంపతుల కలవడిన హృదయ పరివర్తనముగాని ఎరుంగక, కేవలం సవారీ చీకటినుండి, అప్పటికప్పుడు వెలిగి యివలకు చూపబడిన దీపకళికలా, ఒకానొక స్త్రీ వ్యక్తి, అక్కడివా రెవరూ అంతక్రితం ఎరుగని నవ్వుమోముతో, విరా జిల్లు గోముతో, వెలికివచ్చి—ఏదో క్రొంగ్రొత్త అన్వేషణ, ఆవేదన, ఆకాంక్ష తన యెడద ముప్పిరిగొను చొప్పు, లోకము నకు చెప్పకేచెప్పు కళ్లొప్పజెప్పెను.

" ఎవరు నీవు ? " అని జమీందారుడు ఆ స్త్రీని ప్రశ్నించెను. అప్పు డామె యిట్లు బదులాడెను, ప్రజలున్ను సవారీలో నుండి దిగిన ఆమె సంపన్నురాలా, సామాన్యురాలా, సానియా, సంసారియా, అన్న వివక్షత విడిచి, ఆ క్రొత్తమనిషి ఎవరా అనే మీమాంసతో గుర్తింప తల్లక్రిందులు పడుచు, ఆమె చెప్పు చరిత్ర నాలకింప జొచ్చిరి. ఆమె ధరించిన దుస్తులనుకూడా తోడ్తో వింతగా దిలకింప జొచ్చిరి. ముందు దుస్తులు వర్ణించనా, గాథ వినిపింపనా ?

ఆమె వొక నీలం మొఖమల్‌షరాయి తొడిగింది. మొల నుండి పాదములదాకా, మెడనుండి తొడలదాకా అదేరంగు, అదే నునుపు అదే తేటూ గల చొక్కా తొడిగింది. మరిన్ని మెడను మొలివైచి బోరమీదకు నొదులొదులుగ జారేలా శిరోజాలమీద నడకనడిచేలా ఒకానొక తెల్లని పట్టువోణీ, అదే కండువాగా, మేలిముసుగుగా వేసికొంది. కాళ్లను సరిగచార్ల చెప్పులు తొడుక్కుంది, యావత్తు దిరీసుగుండా పచ్చని పాంచాలదేశపు వొంటి వన్నె, కన్నెవయసూ కాపరుస్తూ, నీలనీల మేఘంనుండి వెండి అంచు బయల్పరుస్తూ వెలికివచ్చే సూర్యునిదైన నీరెండమూదిరి చల్లదనం దృక్కుల విలువతోపాటు వెదచల్లుతూ దేవాలయపు మెట్లవద్ద చెప్పులువదలి 'ముందు దేవుని చూడనియ్యండి ! ముందు దేవుని చూడనియ్యండి ! నే నీ ప్రకారముగా దేవుని చూడగలనని యెక్కనాడునూ కల్లోనైనా తలపోయలేదు. ముందు దేవుని చూడనియ్యండి ! నా చరిత్రమాటకేం ? ' అంటూ గుడి లోనికి జొరబడింది. ప్రజలున్ను ఆమె అపరావతారం తాల్చిన ఆండాళ్లమ్మో, అలివేలుమంగ తాయారమ్మాళ్లో, బీబీనాంచారమ్మో

కంచి కామాక్షమ్మో అని భయభ్రాంతులై ప్రక్క-ప్రక్క-ల కొదిగి చేష్టలు దక్కి- చూచుచుండిరి.

జమీందారుడు, జమీందారిణియు మిక్కి-లి ఆమెయొక్క- కథను వినవేచియున్నట్లు క్రిక్కి-రు మనకుండ నొత్తిగిలి యుండిరి. ఆమెయు గర్భగుడిలోని దివ్యవిగ్రహమున కెదురుగా నిలుచుండి 'దేవా! నేనీ అద్భుతవిధముగ, నొక సవారీలో కూరుచుండి, నీ కడకువచ్చి నీ దర్శనము లభించి, తరించియుండి యుందునని ఎన్నడు అనుకోలేదు. రాదారీ బాటనే ఖాళీసవారీ, సవారీలో కూరుచున్నంతనే బోయీలమ్రోత మ్రోతఆగి సవారీ దిగుటలో నీ దేవళద్వారము! అహో ఏమీ, నా అదృష్టము! ఇది, నేను కాందిశీకాంగననయి, ఆ సేతుహిమాచలం దిక్కు-లేక తిరుగాడుటలో దొరకిన పెన్నిధిగా తలంచుచున్నాను. దేవా! దేవా!' అని తనకనుపాపలలో క్రొన్నీడలమర, ఆనీడలనే వాల్లా డించులా జొటజొట మృదుకపోల ముకురాలమీదకు కన్నీళ్లు గార్పజొచ్చెను. 'కాలినడక నెంతదూరము నడచినను నన్ను గనుగొన్న వా రెల్లరు కాందిశీకాంగననసీ, కొరమాలినదానినసీ, మతము సెడినదాననసీ, తమ అభిమతమునకు అణగిమణగి యుండవలసినదాననసీ, ఈ సడించినవారలేగాని యీ విధమున వాసినెత్తి గారవించినవారు లేరు. ఇది నా జీవితమునందు అనుకోని అనుభవము. ఈ నీ దర్శనము ఇతరుల కసంభవము. దేవాదిదేవా;' అని వినమ్రతతో, వివేకముతో, విశాలహృదయముతో, ఆ ఆడమనిషి సాష్టాంగ పడి లేచి, పరిసరమున తన్ను అరయుచున్నవారి నెరుగకోరెను. బేడిమూక ఏదో సందడి నుండెను. జమీందారుడు ఆమెను పలుకరించుటకు తగుసాహసము

వహింపడాయెను. ఇక ఆతని భార్య—'నీవు నిజముగా కాందిశీకాంగనవే యగుదువేని మమ్ముల నందరను వంచించినావు. అందు ముఖ్యముగా నన్ను మోసగించినావు' అని ధీరస్వరముతో నుడివెను.

"నీ వెవరవు" అని క్రొత్తమత్తకాశిని ప్రశ్నించెను.

"నేనా! నేనా" అని జమీందారిణిగా చెప్పుకొనుటకు గాని, మాజీ జమీందారిణిగా పేర్కొనుటకుగాని మనసొప్పక యా యిల్లాలు 'నేనా, నేనా' అని నీళ్లు నమలి, "నామేనా అది! అని మురిసిపోవు నన్ను నా మేనానుండి ఒక్కనిమేషంలో వేరుచేసి నేలపై నడిపించినావు. నీదీప్రజ్ఞ! నా నాధు డెంతచెప్పి నను వినని నన్ను నీవు నేలపై నడిపించినావు. నీదీప్రజ్ఞ! నాకు మిక్కిలి సంతోషముగా నున్నది. నీ నుండి ప్రజలపేక్షించునది లేదు. కాందిశీకాంగనవు. ఇల్లులేదు నీకు. వాకిలిలేదు నీకు, వపతి లేదు నీకు. వ్యాపారములేదు నీకు. కాందిశీకాంగనవు నీవు! అదృష్టవంతురాలివి!' అని అభినందించెను.

కాందిశీకాంగన వెనుదిరిగి మేనావైపు చూడ నభిలషించెను. అంతలో ఆమె కట్టెదుట దివ్యవిగ్రహముయొక్క బంగారు తొడవుల మీదకు, కిరీటముమీదకు, పెద్దవెలుగు వ్యాపించి, నఖశిఖ పర్యంతం చతుర్బాహూదర వక్త్ర నేత్రద్వయము లదర వింత హెచ్చరిక గొలుప జొచ్చెను. 'ఏమా?' అని కాందిశీకాంగన వెన్నునే తిలకించులో, సవారీని ఛిన్నాభిన్నముగచేసి, ప్రజలు భోగిమంట నంటించునట్టు దేవుడి యెట్టయెదట అంటించి జ్వాలగా జేసినారు.

ఆ జ్వాలామాల ఎవరిమెడలోపడి, యింకనూ విషాదపు విడ్డూరము లేమి జరుగునోయని, జమీందారిణియు, జమీందారును, కాందిశీకాంగనను కాచుటలోను, కాందిశీకాంగన వారిని సంరక్షించుటలోను, నిమగ్నులై యుండిపోయిరి. కాని, దేవుని కృపవలన ప్రజలు వారి కెవరికిని ఏ హానియు జేయకుండ 'ఇక వారును మనలాగున నడువవలసినదే! ఇక వారును మనలాగున నడువవలసినదే!' అని అనుకొనుచు క్రమక్రమముగా పలచబడి, ఎవరిఇళ్ళకు వారు వెళ్ళిపోయిరి.

జమీందారును, జమీందారిణియు, కాందిశీకాంగనయు చుక్కవెలుగులో దేవళమును నిర్గమించి విశాలతర ప్రపంచంలో మంచు తడిబాటనే కాలినడకను జనుచు నిట్లనుకొనిరి. కాందిశీకాంగన :—' సవారియెక్కిననే యింటి ముంగిటనైన దింపగలదు. నా కింత ఆతిధ్యము దొరకునని యనుకొంటిని. కాని యిట్టి వైపరీత్యము జరుగునని తలపోయలేదు.' జమీందారిణి:.. ' సవారీ దేవుని దర్శనార్థము నిర్మింపబడినదిగాని నీవంటి దాని కొఱకు గాదు.' జమీందారుడు :—' ఎవరెందు కనుకున్నా, ఆ సవారీ నేడు తగలబెట్టవలసినదే! దానిని గురించి మనమింక వాదులాడ బనిలేదు. మనము ముగ్గురము ఇట్లు కలిసి రాదారినే పోవుచో మఱల ప్రాణగొడ్డము లేవీ కలుగకుండవుగదా! అనునదే యోజించుకొనవలసినది.' కాందిశీకాంగన: ' అనగా మన ముగ్గురిలోను నేనే అధమాధమురాలిని, దురదృష్టవంతురాలిననీ మీ యూహ!' జమీందారుడు :—' కాదు. నీవు మిక్కిలి అందకత్తెవు. యౌవనవిలాసినివి. ఈమె బంగారునగలు ధరించిన గృహిణి. జారచోరుల కిది అనువైన నిశీధిని.' జమీందారిణి:-

ఇవిగో నా మీదనున్న వస్తువులనెల్లను దొంగలు బలాత్కార ముగ గొనకమున్నే యీ నీట పారవేయుచున్నాను.' అని తొల్లింటి కాలువచేరికగా నీటిని దరిసెను. జమీందారుడు:— 'నే బోధించితినని పారవేయవలదు. నీ అంతరాత్మకు తోస్తేనే త్యజింపుము. అసలు అవిన్నీ, మేనాయున్నూ మన యితర సామానులతోపాటు తరలింపబడియుండి యుండవలసినది. అప్పుడు మన మిద్దఱం మాత్రమే ఒకరి కొకళ్ళం తోడునీడలమై ఈ రాదారిని నడచియుందుము. ఇది రహదారీ! ఇందు దాపరికము గాని, దాపుడుధనముగాని లేవు. అది తెలిసి నడచుట ఈ పయినుండి మనవిధి.' అవి హెచ్చరించెను. ఆ యిల్లాలు తన కప్రయత్నముగా కళ్ళమ్మట బొడము చెమరింపును చేతుల తుడిచివేసికొనుచు తన నగలనెల్లను నీళ్ళలోనికి విడిచిపుచ్చెను. కాందిశీకాంగన అది కనీ కనకుండ 'నా యౌవనమింతలో నన్నట్లు విడుచునట్లు లేదు. నా మూలమున మీకు కీడు మూడ నేల? మీరు జనుడు.' అనెను. జమీందారుడూ, జమీందారిణీ రిక్తహస్తులై కాలినడకను పొడుగు రాదారీనిబడి వడివడి నడచి పోవుచుండ, కాందిశీకాంగన జమీందారిణియొక్క దిసమెడ గను గొనుచు, ఆ దంపతులయొక్క నిరాడంబర నిర్గమనమున కచ్చెరువు పడుచు, తానున్నచోట నున్నట్టే కొంతతడ వాగి పోయెను. ఆగిపోయి కాలువనీటిలో జమీందారిణి జారవిడిచిన వస్తువులకొఱకు వంగిచూచెను.

కాని, ప్రవాహము మిక్కిలి వడిగా నుండుటచే అందు చుక్కనీడ తన నీడ కలకలుపై ప్రకాశించుట తక్క మతో విలువ లోహము ధగధగమనుట కాంచలేకపోయెను. అప్పుడామె

వింతగా చింతించినదాయెను. తనకు కనబడిన నూతనప్రకాశము చేత ఆమె తొల్లింటి మోహాము అంతరించెను. అయినప్పటికీ ఆ కాందిశీకాంగన ఈ మోహప్రపంచములో తాను రాదారీని నడచుట క్షేమముగాదని, బల్లకట్టాతని లేపి సూర్యోదయము కాకుండా రేవు దాటి ఆవలితట్టు పెనుచింతక్రింద విశ్రమించి అదే తన కనువైన విడిది గుడి కాదు, గృహాము కాదు—అని గ్రహించెను. చింతచెట్టు నీటి నీడ ఒక వైపునకు, చింతచెట్టు ఎండనీడ మరొకవైపునకు! ఏ నీడ నాశ్రయించుటో ఆమెకు తెలియకుండెను.

తక్కెడ పుటకల్లా రెండునీడలూ ఉపచరింప, చెట్టును ముల్లుగా గొని ఆమె తన జీవితభారమును తూచుకొనుచున్నట్టు తెల్లవాఱి, లోకమునకు గనబడజొచ్చెను. పాపము శమించెను; ప్రాయము విజృంభించెను.

నాటికీ, నేటికీ ఆ చింతక్రింద విశ్రాంతి గొన్నవారిలో వీను మిగిలినవారు క్రితపు సాయంకాలపు మాజీ జమీందార్! నేటి యుదయపు కాందిశీకాంగన! వీ రిరువురే!